సాక్షి
సూర్యాపేట
7
శుక్రవారం ౹ 24 ౹ ఫిబ్రవరి ౹ 2023



సాంస్కృతికోత్సవాల్లో భాగంగా యాదాద్రి ఆలయ సన్నిధిలో కూచిపూడి నృత్యం చేస్తున్న వంద మంది కళాకారులు


యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం మత్స్యాలంకృతుడై శేషవాహన సేవపై ఊరేగుతున్న స్వామివారు

మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్


నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్య ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యనే నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మున్సిపల్ కమిషనర్‌తో శనివారం 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది.

మీరు ఫోన్ చేయాల్సిన తేదీ, 25.02.2023 (శనివారం)
సమయం : ఉదయం
10 నుంచి 11 గంటల వరకు
సెల్ : **9492256688**

న్యూస్‌రీల్

నేడు యాదాద్రికి గవర్నర్


యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ రానున్నారు. ఉదయం 7.45కు రాజ్‌భవన్ నుంచి బయల్దేరుతారు. 8.45కు యాదాద్రి కొండపైకి చేరుకుంటారు. అనంతరం శ్రీస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 9 గంటలకు బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారు. 10.45లకు తిరుగుపయనం కానున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆదరణను చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు


సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజా గోస, బీజేపీ భరోసా కార్యక్రమాలతో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 45వ వార్డులో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుడు కొప్పుల క్రాంతి రెడ్డి పార్టీ దిమ్మెను కడుతుంటే స్థానిక వార్డు కౌన్సిలర్ భర్త అడ్డుకునే ప్రయత్నం చేశాడని ఈ విషయంపై పిటిషన్ ఇస్తే పోలీసులు అతనిపై కేసు నమోదు చేయకుండా తిరిగి తమ నాయకులపై ఏకపక్షంగా కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆబిద్, వీరేంద్ర, మన్మథరావు, కార్తీక్‌రెడ్డి, మల్సూర్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సభ్యత్వాలు ఇవ్వాలి


జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

పెన్‌పహాడ్: అర్హులైన వారికి ఎలాంటి షరతులు లేకుండా సభ్యత్వాలు ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గీతకార్మిక సంఘం కార్యక్రమాల్లో యువత, మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నాలన్నారు. నీరా ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే మహిళలకు ఉపాధి దొరుకుతుందన్నారు. యువకులకు గీతన్న బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్గూరి గోవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు, ఉయ్యాల నగేష్, జనార్దన్, అన్నపూర్ణ, కృష్ణ, నాగమల్లయ్య, రమేష్, సైదులు, కాశయ్య, వెంకన్న, ఎం. వెంకన్న పాల్గొన్నారు.

గోదావరి జలాలు పెంపు

అర్వపల్లి: ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో యాసంగి పంటలకు నీటి అవసరం పెరిగింది. దీంతో నీటిపారుదలశాఖ అధికారులు గురువారం జిల్లాకు గోదావరి జలాలను పెంచారు. 1000క్యూసెక్కుల నీళ్ల వస్తుండగా ఒకేసారి 1700క్యూసెక్కులకు పెంచినట్లు నీటిపారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ అమర్ తెలిపారు. ఇందులో 69డీబీఎంకు 500, 70డీబీఎంకు 100, 71డీబీఎంకు 1,100క్యూసెక్కుల చొప్పున వదులుతున్నట్లు చెప్పారు.

బ్రాండ్ పేరుతో బురిడీ

- నాసిరకం బియ్యం పాలిష్ చేసి.. బ్రాండెడ్ పేర్లతో ఉన్న బస్తాల్లో నింపి..
- నాణ్యమైనవిగా నమ్మిస్తూ విక్రయాలు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- నెలకు రూ. 7.5 కోట్ల వ్యాపారం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో బ్రాండెడ్ బియ్యం పేరుతో కొందరు మిల్లర్లు, బియ్యం దుకాణదారులు మాయాజాలం సృష్టిస్తున్నారు. రంగు రంగుల సంచుల్లో సాధారణ బియ్యానే ఉంచి అమ్మకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు స్థానిక రైస్ మిల్లుల్లో స్థానికంగా పండిన వడ్ల నుంచి వేరుచేసిన రైస్ ప్యాక్ చేసి దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసినట్లు నమ్మిస్తున్నారు. వాటికి మార్కెట్లో నాణ్యతతో కూడిన కంపెనీల పేర్లు తగిలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. గుడ్డిగా నమ్మివాటిని కొనుగోలు చేసి ప్రజలు మోసపోతున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరితో పాటు పలు మండల కేంద్రాల్లో ఈ తరహా మోసం జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

రోజూ 700 క్వింటాళ్ల వరకు విక్రయాలు

జిల్లాలో బియ్యం అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 72 గుర్తింపు పొందిన రైస్ మిల్లులు ఉండగా మరో 100 వరకు చిన్న మిల్లులు ఉన్నాయి. వీటిలో కొన్ని మిల్లుల మాములు బియ్యాన్ని ఆకర్షణీయమైన సంచుల్లో నింపుతూ బ్రాండెడ్ కంపెనీకి చెందినవిగా వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. వీటిపై బ్రాండెడ్ పేర్లు, ఎమ్మార్పీ అధికంగా ముద్రిస్తూ రిటైల్ వ్యాపారులకు సరాఫరా చేస్తున్నారు. వీటిపై ముద్రించిన ధరలకే సదరు దుకాణదారులు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఇలా జిల్లాలో రోజుకు సుమారు 700 క్వింటాళ్ల వరకు బియ్యం అమ్మకాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే బ్రాండెడ్ బియ్యం కాగా మిగితావి అన్‌బ్రాండెడ్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు తాము అమ్మేవే నాణ్యమైనవిగా నమ్మిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. క్వింటాకు రూ. 2 వేలు కూడా విలువ చేయని బియ్యాన్ని రూ. 4వేలకు పైగా విక్రయిస్తున్నారు. జిల్లాలో రోజూ రూ. 28లక్షల బియ్యం వ్యాపారం సాగుతున్నట్లు అంచనా కాగా దీంతో రూ. 25లక్షల వరకు అన్‌బ్రాండెడ్ బియ్యంపై వచ్చే ఆదాయామని తెలుస్తోంది. అంటే జిల్లాలో నెలకు రూ. 7.5 కోట్ల అక్రమ వ్యాపారం సాగుతున్నట్లు ప్రచారం.

ఆ బ్రాండ్ ఖాళీ బస్తాలకు గిరాకీ..

బియ్యంలో కస్టమర్లు నమ్మదగిన బియ్యం కర్నూల్ బ్రాండ్ అంటుంటారు. ఈ బ్రాండ్ బియ్యానికి కాస్త అధిక రేటు ఉంటుంది. అయితే ఈ బియ్యానికి మాత్రమే అధిక ధర కాదు అన్నట్లుగా .. కర్నూల్ బ్రాండ్‌తో ఉన్న ఖాళీ బస్తాకు కూడా అధిక ధరే పలుకుతోంది. సాధారణంగా ఒక్క సారి వినియోగించిన బస్తాను ఎవ్వరూ కొనుగోలు చేయరు. కానీ కర్నూల్ బ్రాండ్‌తో ముద్రించబడి వినియోగించిన ఖాళీ బస్తా రూ. 15 వరకు పలుకుతోంది. అదే కొత్త బస్తా అయితే రూ. 50 వరకు విక్రయిస్తున్నట్లు ప్రచారం.

అధిక ధరకు సాధారణ బియ్యం..

మార్కెట్లో 25 కిలోల బ్యాగు ధర సుమారు రూ.800 నుంచి రూ.1000 వరకు పలుకుతుంది. ఆదే బియ్యాన్ని బ్రాండెడ్ కంపెనీల పేరుగల సంచుల్లో నింపి రూ.1200 నుంచి రూ.2000 వరకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా రేషన్ బియ్యాన్ని కిలో రూ. 7 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసి వాటిని పాలిష్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటినే బీపీటీ, హెచ్‌ఎంటీ, జైశ్రీరాం తదితర రకాలుగా నమ్మిస్తూ వాటిని బ్రాండెడ్ పేరుకలిగిన బ్యాగుల్లో నింపుతూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ వ్యాపారం బహిరంగా కొనసాగుతోంది.

పంట రుణాలకు అధిక ప్రాధాన్యమివ్వాలి


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అధికారులు

- రుణాల మంజూరులో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు
- అన్ని రంగాల్లో 114 శాతం వృద్ధి సాధించాం
- కలెక్టర్ వెంకట్రావు
- కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమావేశం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో పంట రుణాలకు అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాల మంజూరులో ఇబ్బందులు కలిగించొద్దన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు రూ.715.79 కోట్ల రుణాలు టార్గెట్ కాగా రూ. 533.89 కోట్లు అందించామని, మిగిలిన రుణాలు మార్చి మాసాంతం వరకు ఇవ్వాలన్నారు. వ్యవసాయ రుణాల టార్గెట్ రూ. 2452. 40 కోట్లకు రూ. 1928 కోట్లు మంజూరు చేశామని, వ్యవసాయ అనుబంధ రంగాల రుణ లక్ష్యం రూ. 1,217 కోట్లు కాగా రూ.1,506 కోట్లు ఇచ్చామని, పరిశ్రమల రంగంలో టార్గెట్ రూ. 395 కోట్లకు రూ. 614 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. విద్యా రుణాల లక్ష్యం రూ. 32.83కోట్లకు రూ. 13.63 కోట్లు, గృహ రుణ లక్ష్యం రూ. 180.03 కోట్లకు రూ. 51.58 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇతర ప్రాజెక్టులు, వివిధ సెక్టార్ల కింద రుణాల లక్ష్యం రూ.4794.28 కోట్లకు రూ.5426.26 కోట్లు ఇచ్చామని ఇప్పటివరకు అన్ని రంగాల్లో 114 శాతం వృద్ధి సాధించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రుణ లక్ష్యం రూ. 4700.68 కోట్లకు రూ.5374.68 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో లీడ్ బాంక్ మేనేజర్ బాపూజీ, ఆర్‌బీఐ ఏజీఎం సాయి చరణ్, నాబార్డ్ ఏజీఎం సత్యనారాయణ, ఎస్‌బీఐ ఏజీఎం కృష్ణ మోహన్, అధికారులు రామారావు నాయక్, శ్రీధర్ గౌడ్, తిరుపతయ్య, శిరీష, శ్రీనివాస్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

త్వరలో ఈ- ఆఫీస్ విధానం అమలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఈ- ఆఫీస్ విధానాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. ఈ- ఆఫీస్ విధానం, నిర్వహణ, అమలుపై గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావుతో కలసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ముందుగా కలెక్టరేట్‌లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేపర్ రహితంగా ఉండే విధానాన్ని జిల్లా అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ విధానం అమలుపై అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెబెక్స్ ద్వారా ట్రైనర్లతో ఫైలింగ్ సిస్టం తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నేర నిరూపణలో సీసీ కెమెరాలు కీలకం


మద్దిరాలలో పోలీసుల వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

మద్దిరాల : నేర నిరూపణలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సమాజంలో సీసీ కెమెరాల ఆవశ్యకత ఉందని గ్రామాల్లో వీటి ఏర్పాటుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. సిబ్బంది దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు బెట్టింగులు, జూదం లాంటివి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐలు నర్సింగ్ వెంకన్న, డానియల్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

తుంగతుర్తి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై స్వతరమే స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. పోలీసులు సయప్టింగా పనిచేసి పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. సమాజంలో నేరాలను అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒత్తిడి లేకుండా పనిచేయాలని, రాష్ట్ర పోలీస్‌శాఖలో అమలవుతున్న సాంకేతికత, పని విభాగాలు, స్టేషన్ నిర్వహణ అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించి, పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, సీఐ నాగార్జునగౌడ్, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల ఎస్‌ఐలు డానియల్‌కుమార్, వెంకన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

● భౌబోయ్


పొట్టిశ్రీరాములు సెంటర్‌లో రోడ్డుపైనే తిరుగుతున్న కుక్కలు


సూర్యాపే పట్టణంలో నల్లాలబావి వద్ద..

జిల్లాకేంద్రంలో ఏ వీధిలో చూసినా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని చిన్న వీధి నుంచి ప్రధాన రహదారి దాకా అంతటా పగలు, రాత్రి అనే తేడా లేకుండా జనం మధ్యలో, వాహనాలకు అడ్డుగా సంచారం చేస్తూనే ఉన్నాయి. హైదరాబాద్‌లో ఓ బాలుడిని వీధి కుక్కలు పొట్టన పొట్టుకోవడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డుపై వెళ్లే తమపై ఎక్కడా.. ఏ క్షణంలో దాడి చేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టి సంతాన నిరోధక చర్యలు చేపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

యూరియా కోసం కష్టాలు


యూరియా కోసం రైతుల తోపులాట

అర్వపల్లి: అన్నదాతలకు యూరియా కొరత మొదలైంది. దుకాణాలకు యూరియా స్టాక్ వచ్చిందని తెలిస్తే చాలు రైతులు బారులుదీరుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, అర్వపల్లి పీఏసీఎస్‌లకు గురువారం 888బస్తాల యూరియా రాగా గంట వ్యవధిలోనే అమ్ముడుపోయింది. యూరియా కోసం తిమ్మాపురం పీఏసీఎస్ వద్ద వందలాది మంది రైతులు ఎండలో బారులుదీరి ఉన్నారు. ఒక్కో రైతు 5నుంచి 10బస్తాల వరకు కావాలని కోరగా 3బస్తాల వరకు ఇచ్చారు. దీంతో రైతులు పీఏసీఎస్ సిబ్బందితో గొడవకు దిగారు. స్టాక్ ఉన్నంత వరకు ఇస్తామని మళ్లీ రాగానే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సిబ్బంది చెప్పినా రైతులు అంగీకరించలేదు. మోతాదుకు మించి యూరియా వాడుతుండటం వల్లనే కొరత ఏర్పడుతుందని మండల ఏఓ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఎకరాకు రెండున్నర బస్తాల యూరియాకు బదులు రైతులు ఐదారు బసాలు వేస్తున్నారని దీంతో కొరత ఏర్పడుతోందని చెప్పారు. మరింత యూరియా తెప్పించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.


తిమ్మాపురం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

అమ్మకు అందని సాయం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికి ప్రోత్సాహం కరువు
- నిధుల కొరతతో ఖాతాల్లో జమకాని కేసీఆర్ కిట్ పథకం నగదు
- 62,594 మంది లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు

నాగారం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు, మాతా శిశు ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2017జూన్2న ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ నగదు పథకం అర్హులకు అందని ద్రాక్షగా మారింది. ఆస్పత్రుల్లో కాన్పులు చేసుకున్న అమ్మలకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం నిధులు రెండేళ్లుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదు. దీంతో జిల్లాలో సుమారు 62వేల మందికిపైగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమకాక బకాయిలు పేరుకుపోయాయి. పథకానికి క్షేత్రస్థాయిలో మంచి స్పందన లభించినా ప్రస్తుతం నిధుల లేమితో అభాసు పాలవుతోంది.


ప్రసవమైన మహిళలకు అందించే కేసీఆర్ కిట్

పథకం అమలు ఇలా..

గర్భిణులతో పాటు పుట్టబోయే బిడ్డకు పది నెలలు నిండే వరకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్ నగదు పథకాన్ని అమలులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్న గర్భిణులకు ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగశిశువు పుడితే రూ.12వేల చొప్పున అందజేస్తుంది. దీని ప్రకారంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నాలుగు విడతల్లో నేరుగా ఆర్థిక సహాయం సొమ్మును జమ చేస్తున్నారు. గర్భం దాల్చిన ఐదు నెలలలోపు సర్కారు ఆస్పత్రిలో రెండు సార్లు పరీక్షలు చేయించుకున్న వారికి తొలివిడతగా రూ.3వేలు చెల్లిస్తారు. తరువాత ఆస్పత్రిలో కాన్పు జరిగిన తర్వాత పాప పుడితే రూ.5వేలు, బాబు జన్మిస్తే రూ.4వేలు అందిస్తారు. శిశువుకు మూడున్నర నెలల్లో క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించగానే రూ.2వేలు, తొమ్మిదో నెలలో వ్యాక్సిన్ తర్వాత రూ.3వేల చొప్పున ఖాతాల్లో జమ చేస్తారు. రెండేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.

పథకం వివరాలు	
2021–22లో..	
లబ్ధిదారులు	34,048
నగదు అందిన వారు	2,943
అందనివారు	31,047
2022–2023లో ..	
లబ్ధిదారులు	31,551
నగదు అందిన వారు	04
అందనివారు	31,547

62వేల మందికి పైగా..

రెండేళ్లుగా లబ్ధిదారులకు కేసీఆర్ కిట్ నగదు అందకపోవడంతో జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 62,594కు పైగా చేరింది. 2021–22 సంవత్సరంలో 34,048 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకోగా వీరిలో 2,943 మందికి మాత్రమే నగదు అందింది. మిగతా 31,047 మందికి నగదు రావాల్సి ఉంది. అలాగే 2022–23లో 31,551 మంది కాన్పులు చేయించుకోగా వీరిలో నలుగురికి మాత్రమే నగదు వచ్చింది. ఇంకా 31,547 మందికి అందాల్సి ఉంది. రెండేళ్లుగా కేసీఆర్ కిట్ నగదు పథకం చెల్లింపులు నిలిచిపోవడంతో కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో లబ్ధిదారులు ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిధులు రాలేదని అధికారులు చెబుతున్నారు. ప్రసవం జరిగిన వెంటనే రూ.2వేలు విలువ చేసే 16 రకాల వస్తువులుండే కేసీఆర్ కిట్‌ను మాత్రం వెంటనే పంపిణీ చేస్తున్నారు. కానీ ఆర్థిక సాయం విషయంలో మాత్రం చేతులెత్తేస్తున్నారు.

నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతాయి



ప్రభుత్వం నుంచి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ అవుతుంది. జిల్లాస్థాయిలో లబ్ధిదారుల వివరాలను వెంటనే విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పేర్లు నమోదు అయిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా కేసీఆర్ కిట్ పథకం ద్వారా ప్రభుత్వ సాయం అందుతుంది.

– డాక్టర్ కోటాచలం, డీఎంహెచ్‌ఓ, సూర్యాపేట.

ఇంకా కొనసాగుతున్న పనులు



యాదగిరిగుట్ట పట్టణంలో మైకులు, లైట్లు బిగిస్తున్న కార్మికులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై మూడు రోజులు అవుతున్నా విద్యుత్ దీపాలు, మైకుల బిగింపు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయకపోవడంతో మైకుల్లో ఆధ్యాత్మిక పాటలు రాక, విద్యుత్ వెలుగులు లేక యాదాద్రి క్షేత్రంతో పాటు పట్టణం వెలవెలబోతుంది. తాత్కాలిక విద్యుత్ దీపాల కాంట్రాక్ట్ తీసుకున్న వారికి, అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ప్రధానాలయం ఉద్ఘాటన తర్వాత జరుగుతున్న తొలి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని చెప్పిన అధికారుల మాటలు ఉట్టి నీటి మూటలేనని భక్తులు విమర్శిస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : క్యాంపస్ ప్లేస్‌మెంట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. మొదట చిన్న అవకాశం వచ్చినా వినియోగించుకొని పెద్ద అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. అనేక కంపెనీలతో యూనివర్సిటీ ప్లేస్‌మెంట్స్ చేపట్టేందుకు ఎంఓయూ చేసుకుందని తెలిపారు. ఉద్యోగ మేళాకు 250 మంది అభ్యర్థులు పాల్గొనగా 105 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో రమేష్, సుదీర్, సందీప్ పాల్గొన్నారు.

మత్స్యావతారుడిగా.. శేష వాహన సేవలో

- కనుల పండువగా కొనసాగుతున్న యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు
- అలంకార సేవలకు శ్రీకారం చుట్టిన ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. గురువారం మూడో రోజు అలంకార సేవలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంలో ఉదయం నిత్యారాధనలు పూర్తైన తర్వాత ఆచార్యులు ప్రథమ ప్రాకార మండపంలో స్వామి వారిని మత్స్యావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పడమటి రాజగోపురం నుంచి బయల్దేరి ఉత్తరం, తూర్పు, దక్షిణ రాజగోపురాల ముందు నుంచి అలంకార సేవను ఊరేగింపుగా తీసుకెళ్లి పడమటి రాజగోపురం ముందు ఉన్న వేంచేపు మండపం వద్ద అలంకార సేవను అధిష్టించారు. సేవకు ముందు ఒక వైపు ఆలయ అధికారులు.. మరో వైపు ఆలయ ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు కూర్చొని స్వామి వారిని ఆరాధిస్తూ పారాయణం పఠించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, మోహనచార్యులు, ఆలయ అధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.



మత్స్యావతారంలో ఊరేగుతున్న స్వామివారు

సాయంత్రం శేషవాహనంపై ఊరేగింపు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆచార్యులు నిత్యారాధనలు నిర్వహించి రాత్రి 7గంటలకు స్వామి వారిని శేష వాహనంపై తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం వేంచేపు మండపంలో స్వామివారిని అధిష్టించి వేద మంత్రాలు, పారాయణాలు పఠించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



శేష వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

నేటి కార్యక్రమాలు ఇవీ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం, రాత్రి అలంకార సేవలను ఊరేగిస్తారు. ఉదయం 9 గంటలకు వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి7 గంటలకు హంస వాహన సేవ ఉంటుందని ఆచార్యులు పేర్కొన్నారు.



కర్ణాటక గాత్ర కచేరిని తిలకిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఈఓ గీతారెడ్డి తదితరులు



కర్ణాటక గాత్ర కచేరి చేస్తున్న టీకే సరోజ, టీకే సుజాత సిస్టర్స్

తిరు కల్యాణ వేదిక పరిశీలన



తిరు కల్యాణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీపీ, ఆలయ ఈఓ

యాదగిరిగుట్ట: యాదాద్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 28న నిర్వహించే స్వామివారి తిరు కల్యాణ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి, భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర పరిశీలించారు. ఆలయ తూర్పు రాజగోపురం సమీపంలో ఉన్న బ్రహ్మోత్సవ మండపంలో కల్యాణ వేదిదికను కలెక్టర్, డీసీపీ ఖరారు చేశారు. భక్తులు కల్యాణ వేదిక వద్దకు ఎలా వస్తారు, వీఐపీల భద్రతకు సంబంధించి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు, స్వామి వారి సేవ ఎక్కడి నుంచి వస్తుందనే అంశాలపై ఆలయ ఈఓ గీతారెడ్డి, సివిల్ అధికారి దయాకర్‌రెడ్డితో చర్చించారు. భక్తులు, వీఐపీలు, ఆచార్యులు వచ్చే మార్గాల్లో గ్యాలరీలు, గేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తూర్పు రాజగోపురం ముందు సుమారు 3వేల మందికి పైగా భక్తులు కూర్చునే విధంగా, అదే విధంగా క్యూకాంప్లెక్స్‌పై, ఉత్తర రాజగోపురం ముందు మరో 10వేల మందికి పైగా భక్తులు కల్యాణాన్ని తిలకించే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయాధికారులు కలెక్టర్, డీసీపీలకు తెలిపారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ అధికారులకు తెలియజేశారు. అనంతరం కలెక్టర్, డీసీపీలు స్వామి వారిని దర్శించుకున్నారు.



క్యూలైన్ నీడకు కూర్చున్న భక్తులు

ఎండలతో ఇబ్బందులు

యాదగిరిగుట్ట: రోజురోజుకు ఎండలు దంచికొడుతుండడంతో యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపై సరైన నీడ సౌకర్యం లేకపోవడంతో తలపై మండుటెండకు తోడు కృష్ణశిలతో ఏర్పాటు చేసిన ఫ్లోరింగ్‌పై మండుతున్న కాళ్లతో గురువారం భక్తులు పరుగులు పెట్టారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక పలువురు భక్తులు క్యూలైన్ల నీడకు కూర్చున్నారు.

సాంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయంలో గురువారం నిత్య పూజలు కొనసాగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, అష్టోత్తరం వంటి పూజలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. వివిధ పూజలతో స్వామి వారికి నిత్యాదాయం రూ.17,35,324 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



పూజలు చేస్తున్న ఆచార్యులు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గండి చెరువులో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గండి చెరువులో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం తేలుతుండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువలో నుంచి బయటకు తీయించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు మూడు, నాలుగు రోజులు క్రితమే చనిపోయినట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

కోదాడరూరల్: అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోదాడ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వంటి కొమ్ము రాజారెడ్డి(46) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల లారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కోలుకున్న తర్వాత కూడా పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో జీవితంపై విరక్తితో గురువారం స్థానిక పెద్ద చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక ఫైర్ స్టేషన్ డ్రైవర్ భుక్యా శివాజీ సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు లక్ష్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



జాజాల రవి

డిండి: మండల పరిధిలోని రుద్రాయగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రాయగూడెం గ్రామానికి చెందిన జాజాల రవి ఈ నెల 18వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఊర్కొండపేట వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా రవి ఆచూకీ లభించకపోవడంతో అతడి తండ్రి బాలకిష్టయ్య గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ స్టేషన్ రైటర్ ప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

రామగిరి(నల్లగొండ): కాలేజీకి వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువతి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని గంగన్నపాలెం గ్రామానికి చెందిన తండు రమేష్ పెద్ద కుమార్తె అఖిల(18) నల్లగొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డీఎంఎల్‌టీ(పారా మెడికల్ కోర్సు) ప్రథమ సంవత్సరం చదువుతుంది. అఖిల గత మూడు నెలల నుంచి కాలేజీకి వెళ్లకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మట్టయ్య తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తికి గాయాలు

డిండి: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన నల్ల కృష్ణయ్య డిండి మండల పరిధిలోని టి. గౌరారం గ్రామంలో గురువారం వివాహ వేడుకకు హాజరై తిరిగి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో డిండి నుంచి దేవరకొండ వెళ్లే మార్గంలో ఖానాపూర్ గేటు సమీపంలో దేవరకొండ నుంచి డిండి వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో కృష్ణయ్య కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న బంధువులు కృష్ణయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ఆస్పత్రికి తరలించారు.

డ్రిల్లింగ్ చేస్తుండగా పేలుడు.. ఒకరు మృతి

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని గోపలాయపల్లి గ్రామ శివారులో ఐడీఎల్ ఫ్యాక్టరీ ప్రహరీ నిర్మాణంలో గురువారం ప్రమాదవశాత్తు పేలుడు సంభవించి ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ బొడిగె రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గోపలాయపల్లిలో ఐడీఎల్ కంపెనీకి సంబంధించిన స్థలానికి ఇరువైపులా ప్రహరీ నిర్మాణ పనులు గత 15 రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ పనులు చేసేందుకు గాను కంపెనీ యాజమాన్యం రంగారెడ్డి జిల్లాకు చెందిన రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కాంట్రాక్ట్ అప్పగించింది. కాగా గురువారం ట్రాక్టర్‌తో డ్రిల్లింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. దీంతో సైట్ ఇంజనీర్ కోటగిరి సాయిలు, బండారు పరమేష్, ఎస్‌కే సయ్యద్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని హైదరాబాద్‌కు తరలించగా, కోటగిరి సాయిలు(29) చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలి

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

హాలియా: రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. అనుముల మండలంలోని మధారిగూడెంలో గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జానారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రైతులకు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూ పంపిణీ వంటి హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపు నిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తే ప్రతి పేదవాడికి పక్కా గృహాలు, రుణమాఫీ, రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర, సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, జూపల్లి శ్రీనివాస్, రిక్కల వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రిక్కల రామకృష్ణారెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, పాంపాటి శ్రీనివాస్, ఏసురాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎస్‌కే సర్వర్ తదితరులున్నారు.



మధారిగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి

కంటి వెలుగును వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

మోతె: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. గురువారం మోతె మండల పరిధిలోని భోజ్లతండాలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు నిర్వహించి అద్దాలు, మందులు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ హరిసింగ్‌నాయక్, సర్పంచ్ భూక్యగాంధీ, ఉపసర్పంచ్ గ్యామ, వార్డు మెంబర్లు, డాక్టర్ నాగరాజు పీహెచ్ఎన్ సీత, సూపర్‌వైజర్ కమలమ్మ,హెల్త్‌అసిస్టెంట్ సైదులు, ఆరోగ్య సిబ్బంది,ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్

కోదాడరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు కోదాడ రూరల్ ఎస్‌ఐ సాయిప్రశాంత్ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ గనాత్కూర్ ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీలు మార్గమధ్యలోని చెక్‌పోస్టును తప్పించుకునేందుకు కాపుగల్లు మీదుగా వస్తుండగా ఆ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. రెండు లారీలను సీజ్ చేసి లారీ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

హాలియా: హాలియా వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం పట్టుకొని సీజ్ చేసినట్లు హాలియా ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు అనుముల గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు తక్కెళ్లపల్లి సైదులు, పిట్టల కొండల్, ప్రభాకర్, యడవల్లి రంజిత్, పులిమామిడి గ్రామానికి చెందిన బొమ్మపాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి అవసరం

- డీఈఓ అశోక్

తుంగతుర్తి: పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి అవసరమని డీఈఓ అశోక్ సూచించారు. గురువారం మండలంలోని తుంగతుర్తి, గొట్టిపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. మన ఊరు-మనబడి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కొండగడ్పుల యాకయ్య, గురువయ్య, షేక్.ఉమర్, ఉపాధ్యాయులు కృష్ణవేణి, భాస్కర్, రవీందర్, శ్రీనివాస్, హరిక్రిష్ణ పాల్గొన్నారు.



గొట్టిపర్తిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో అశోక్

విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు

డిండి : ప్రయాణికులతో ఆర్టీసీ బస్సును అడ్డుకున్న వ్యక్తిపై మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం సాయంత్రం డిండి నుంచి వయా కందుకూరు మీదుగా దేవరకొండకు వెళ్తుంది. మార్గమధ్యలో కందుకూరు గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన, హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కె. శ్రీనువాసులు కొంతమంది వ్యక్తులతో కలిసి ఇసుక ట్రాక్టర్‌లను నిలిపివేశాడు. అదే మార్గం గుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సును కూడా దాదాపు 2 గంటల పాటు ఆపాడు. దీంతో తమ విధులకు ఆటంకం కల్గించాడని కండక్టర్ శ్రీరామదాసు సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనువాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ స్టేషన్ రైటర్ ప్రసాద్ తెలిపారు.



విద్యుత్ కాంతులతో మిరిమిట్లుగొల్పుతున్న యాదాద్రి ఆలయం